క్లుప్తంగా

కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలు అందజేస్తున్న వైద్యుడు హేమంత్‌కుమార్, రోటరీక్లబ్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆర్‌కే కంటి వైద్య శాలలో కంటి వైద్య నిపుణులు హేమంత్ కుమార్, రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి శస్త్ర చికిత్సలు చేయించుకొన్న 35 మందికి ఆదివారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల వారికి కంటి వైద్య శస్త్ర చికిత్సలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు బైలుప్పుల షఫీవుల్లా, కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డి, మాచాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో సంతోషంగా రైతులు



మబ్బు ఆంజనేయ

పెద్దకడబూరు : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు గిట్టుబాటు ధరలతో సంతోషంగా ఉండేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దీనంగా తయారైందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతమున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిరుప రైతుల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. మిర్చి ధరలు మార్కెట్‌లో రోజురోజుకు పూర్తిగా పడిపోతున్నాయన్నారు. మిర్చికి, వరికి గిట్టుబాటు ధరలు లేక ఇల్లూ వాకిలీ అమ్ముకోవాల్సిన దుస్థితి దాపరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశాడు.

ఆంజనేయ్యస్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని 52బసాపురం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి కార్తీకమాసం ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చేరుకున్న వై.ప్రదీప్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు మండల నాయకులు గుర్రెడ్డి కాంతరెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన శేకన్న

ఆలూరు రూరల్: కారు, స్కూటర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఆదివారం మధ్నాహం ఆలూరు సమీపంలోని 133 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రమాదం జరిగింది. వివరాలు.. మండలంలోని కురువళ్లి గ్రామానికి చెందిన శేకన్న, మంజు స్కూటర్‌పై ఆలూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ సమయంలో ఆలూరు వైపు నుంచి బళ్లారికి వెళ్తున్న కారు స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొట్టి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో శేకన్న తలకు తీవ్రగాయాలు కాగా మంజు ఎడమకాలు,వీపుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆస్పత్రికి రెఫర్ చేశారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు, ముగ్గురు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు



ఊరేగింపుగా గంధం తీసుకెళుతున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని జొన్నగిరిలో దస్తగిరిస్వామి దర్గా ఉరుసు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున తిమ్మనచెర్ల విజయభాస్కర రెడ్డి ఇంటి నుంచి మేళతాళాలతో గంధం ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాల కతీతంగా భక్తులు దర్గాను సందర్శించి చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. మిఠాయి, ఆటబొమ్మలు, గాజుల అంగళ్లు, రంగుల రాట్నం, జెయింట్ వీల్, జంపింగ్ స్లైడ్ వంటివి వెలిశాయి. సోమవారం వేకువజామున స్వామి ప్రతిమను ఊరేగిస్తామని ముజావర్లు తెలిపారు.

మూలన పడిన 'స్వచ్ఛత'

- 8 నెలలుగా నిర్వహణ లేక నిరుపయోగంగా చెత్తసేకరణ వాహనాలు
- నిధులు మంజూరు చేయని ప్రభుత్వం
- తోపుడు బండ్లతో చెత్త సేకరణ
- ఇబ్బందులు పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు



పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలు,



పట్టణంలో సేకరించిన చెత్తను తోపుడు బండ్ల నుంచి ట్రాక్టర్‌లో వేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చెత్తసేకరణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రాలీ ఆటోలు మూలన పడ్డాయి. ప్రభుత్వం వాటి నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో పట్టణంలో గత ఎనిమిది నెలలకు పైగా ఆయా వాహనాల నిర్వహణ లేక మూలన పడేశారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు తోపుడు బండ్ల ద్వారా చెత్త సేకరణ చేయాల్సి వస్తోంది.

ప్రతి రోజూ 60 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ

పట్టణంలో 34 వార్డులుండగా 80కి పైగా కాలనీలతో పాటు శివారు ప్రాంతాలు ఉన్నాయి వీటి ద్వారా ప్రతి రోజు 60మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో చెత్త సేకరణకు గత ప్రభుత్వం 15కి పైగా ట్రాలీ ఆటోలను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం చెత్త సేకరణకు వాహనాలు లేకపోవడంతో కార్మికులు తోపుడు బండ్లపై అష్టకష్టాలు పడుతూ చెత్త సేకరించి ప్రధాన రహదారుల వద్ద పెద్ద కుండీల్లో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్లు, చెత్త కుండీలీ నుంచి కంపాక్టర్ల ద్వారా కంపోస్టు డంపింగ్ యార్డ్‌కు తరలించే ప్రక్రియ కొనసాగుతోంది.

గతంలో ఒక్కో వాహనానికి రూ.60వేలు చెల్లింపు

చెత్త సేకరించే ఆటోట్రాలీ వాహనాల నిర్వహణకు గతంలో ఒక్కోదానికి మున్సిపాలిటీ నుంచి నెలకు రూ.60వేల వరకు మున్సిపాలిటీ వసూలు చేసిన పన్నుల నుంచి చెల్లించే వారు. అయితే ప్రస్తుతం చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోవడంతో కాంట్రాక్టర్ వాహనాలను నిలిపివేశాడు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెత్త పన్ను ఎత్తివేసి, ఆయా వాహనాల నిర్వహణ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పిన మాటలు ప్రకటనకే పరిమితమయ్యాయే తప్ప ఆమలుకు మాత్రం నోచుకోలేదు. దీంతో తోపుడు బండ్లపై చెత్త సేకరణ ఇబ్బందిగా మారిందని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా చెత్త సేకరణ వాహనాలను వినియోగంలోకి తెచ్చి పట్టణంలో చెత్త సేకరణ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసువాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఇదిలా వుండగా ఎనిమిది నెలలకు పైగా వాహనాలు మూలన పడేయడంతో అవి తుప్పుపట్టిపోతున్నాయి. బ్యాటరీలు డౌన్ అవ్వడంతో పాటు టైర్లు కూడా పాడవుతున్నాయి.

"ప్రతిపాదనలు పంపించాం



పట్టణంలో చెత్త సేకరణలో ఎలాంటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెత్త సేకరించే వాహనాలను ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు మున్సిపల్ శాఖకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వస్తే వాటిని ఉపయోగించి చెత్త సేకరణకు వినియోగిస్తాం.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

కోసిగి హాస్టల్‌లో ఇంకుడు గుంత ఏర్పాటు



హాస్టల్ వెనుక భాగంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ప్రాంగణంలో డ్రైనేజీ నీటి సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ అధికారులు ఇంకుడు గుంత ఏర్పాటు పనులు చేపట్టారు. హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతి వరకు 210 మంది విద్యార్థులు చదువుతున్నారు. హాస్టల్ వెనుక భాగంలో డ్రైనేజీ నీరు నిల్వ ఉండి దుర్వాస వస్తోంది. విషయాన్ని ×సాక్షి≡ వెలుగులోకి తీసుకురావడంతో ఇటీవల జిల్లా అధికారులు పర్యటించారు. తాత్కాలికంగా డ్రైనేజీ నీళ్లు ఇంకి పోయేందుకు ఇంకుడు గుంత తవ్వించమని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ సిబ్బంది జేసీబీ ఏర్పాటు చేసి పరిసరాలను శుభ్రం చేయించారు. అలాగే ఇంకుడు గుంతను తవ్వించే పనులు ప్రారంభించారు.

పిల్లలను బడికి పంపండి



భిక్షాటన చేస్తున్న తల్లిదండ్రులు, పిల్లలకు సూచనలు చేస్తున్న సీఐ సూర్యమోహన్‌రావు

ఆదోని అర్బన్: పిల్లలను బడికి పంపించి వారిని రేపటి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు అన్నారు. స్థానిక ఎంఎం కాలనీలో భిక్షాటన చేస్తున్న వారిని, వారి పిల్లల్ని ఆదివారం స్టేషన్ వద్దకు పిలిపించి పాఠశాలపై, చదువుపై సీఐ అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ కటిక పేదరికంలో పుట్టి ఏ ఒక్కరినీ సాయం అడగకుండా కష్టపడి చదివి రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్ ఆశయలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పిల్లలను భిక్షాటనకు ప్రోత్సహించకుండా వారిని కష్టపడి చదివించేలా తీర్చిదిద్దాలని సూచించారు. అంతేగాకుండా ప్రతిరోజూ బడికి పంపి వారిని రేపటి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహించాలే కానీ భిక్షాటన చేసేందుకు ప్రోత్సహించకూడదన్నారు. భిక్షాటన చేయడం వల్ల పిల్లలు అసాంఘిక కార్యకలాపాలకు అలవాటు పడి రౌడీలుగా, దేశద్రోహులుగా తయారవుతారన్నారు. ఉచితంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలల్లో చదివించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. అలాగే భిక్షాటన చేస్తున్న పిల్లలకు చదువు ప్రాముఖ్యతను వివరించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరప్ప మృతి



శంకరప్ప మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని 25వవార్డు వెంకన్నబావి వీధిలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కురువ శంకరప్ప అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అనుచరగణంతో మృతుడి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకరప్ప కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. శంకరప్ప మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటన్నారు. వెంకన్నపేట వీధిలో పార్టీ పరంగా ఎన్ని కార్యక్రమాలు చేసినా తనే దగ్గరుండి చూసుకునేవారని తెలిపారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సరోజమ్మ భర్త రాముడు అనారోగ్యంతో ఇంటి పట్టునే ఉండడంతో ఆయనను పరామర్శించారు.



సొరంగం అవతలి వైపు ప్రవహిస్తున్న ఎల్లెల్సీ


ఎల్లెల్సీ హొయలు

- సుందర మనోహరంగా తుంగభద్ర దిగువ కాలువ ప్రయాణ మార్గం
- ఆకట్టుకుంటున్న 'హిల్ కటింగ్'
- కట్టిపడేసే ప్రకృతి అందాలు
- అద్భుతంగా కొండలో నుంచి బయటకెళ్లే దృశ్యం



కొండలో నుంచి బయటకొస్తున్న కాలువ

తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) హొళగుంద సెక్షన్ పరిధిలోని హిల్ కటింగ్ దృశ్యాలు అమితంగా ఆకట్టుకుంటున్నాయి. 1950లో తుంగభద్ర జలాశయం నిర్మాణ దశలో ఈ కాలువ తవ్వకం పనులు జరిగాయి. టీబీ డ్యామ్ నుంచి దాదాపు 354 కి..మీ నిడివి ఉన్న కాలువ తవ్వకంలో భాగంగా హొళగుంద సమీపంలో 186వ కి.మీ వద్ద ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులో కొండ అడ్డుగా వచ్చింది. దీంతో కొండను భారీ యంత్రాలు, కూలీలతో తొలచి సొరంగం తవ్వారు. అందులో నుంచి తుంగభద్ర నీరు దిగువ కాలువలో ఆంధ్రా వైపు హొయలొలుకుతూ పరుగులు పెడుతున్న దృశ్యాలు సుందర మనోహరంగా ఉంటాయి. యువకులు, విద్యార్థులు, స్నేహితులు ఇక్కడికొచ్చి కాలక్షేపం చేసి వెళ్తుంటారు. సొరంగం పరిసరాలు వీక్షకులను అబ్బుర పరుస్తాయి. కొండను దాటదానికి సిమెంట్ రోడ్డు కూడా వేశారు. దిగువన కనుచూపు మేర పచ్చని పంట పొలాలు, కొండలు, పక్షుల కిలకిలలు, సొరంగంలో నిశ్శబ్దంగా పారుతున్న తుంగభద్ర నీరు, చుట్టూ ఆహ్లాదకర పరిసరాలతో మరో లోకంలో ఉంటున్నామా అనే అనుభూతి కలుగుతుంది. అంతేగాక హిల్ కటింగ్‌పై వెలసిన కణివే పోతప్ప ఆలయంతో పాటు నాగప్ప కట్టను సమీప గ్రామాలకు చెందిన భక్తులు కొలుస్తారు. ఈ ప్రదేశం పర్యాటకానికి అనువుగా ఉంటుంది. అయితే రాత్రి పూట ఈ మార్గంలో తిరగడానికి అనువుగా ఉండదు. – హొళగుంద



హొన్నూరు కొట్టాల సమీపంలో కొండలో తవ్విన సొరంగ మార్గంలో ప్రవేశిస్తున్న తుంగభద్ర దిగువ కాలువ

హైందవ శంఖారావం పోస్టర్ల విడుదల

ఆదోని రూరల్: హైందవ శంఖారావం చలో విజయవాడ పోస్టర్లను ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, విట్టా రమేష్, బీజేపీ రాష్ట్ర సభ్యులు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మంతా బుగ్గా రమేష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. అలాగే ప్రతి ఇంటింటికి అతికించడానికి స్టిక్కర్ ఆవిష్కరించారు. ఈనెల 11వ తేదీన బైక్ ర్యాలీని స్థానిక అంబాభవానీ దేవస్థానం నుంచి ఉదయం 10 గంటలకు ప్రారంభం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. హిందూ బంధువులందరూ బైకు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నగర అధ్యక్షులు సాకరే ఈరన్నరావు, నాయకులు శేషారెడ్డి, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

14, 15న రాష్ట్ర మహాసభలు

ఆదోని టౌన్: ఈనెల 14, 15వ తేదీల్లో అనంతపురంలోని అంబేడ్కర్ భవన్‌లో మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మహాసభలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రబాబు తెలిపారు. ఆదివారం వారు స్థానిక కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల్లో కులగణన ఎందుకు అవసరం అన్న అంశంపై సామాజిక విశ్లేషకులు, మాజీ రాష్ట్రపతి కె.ఆర్. నారాయణ్ ఓఎస్డీగా పనిచేసిన ఎస్.ఎన్.సాహూ ప్రసంగిస్తారని చెప్పారు. బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు అన్న అంశంపై స్వతంత్ర విలేఖరి మాలిని సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తారని చెప్పారు. విద్యార్థులు, యువజనులు, మహిళలు, కార్మికులు, కర్షకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అపార్ సమస్యలను పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: అపార్ ఐడీ నమోదులో సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ సీనియర్ నాయకులు బి.సత్యన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో సంఘం మండల అధ్యక్షుడు సి.రామకృష్ణ అధ్యక్షతన ఆదోని, కౌతాళం మండల నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ విద్యార్థుల అధార్‌లో ఇబ్బందులను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, పాఠశాలల్లోనే మొబైల్ ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీయూ అకాడమిక్ కమిటి సభ్యులు మహదేవప్ప మాట్లాడుతూ ఎస్‌జీటీ సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలన్నారు. పదోన్నతి ద్వారా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గోపాల్, రామాంజినేయులు, సుధాకర్, షేక్షావలి, అంజినయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, జలాభిషేకం, కుంకుమార్చన, భండారార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నైవేద్యం సంతర్పణ పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

రోడ్లపై గుంతలు పూడ్చాలి



పాండవగల్ సమీపంలో ఏర్పడిన గుంత వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: ఆదోని నుంచి మాధవరం వెళ్లే రహదారిలోని పాండవగల్ దగ్గర రోడ్డుపై పడిన గుంతను పూడ్చాలని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న డిమాండ్ చేశారు. గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చకపోవడంతో ఒక మనిషి ప్రాణంతో పాటు పదుల సంఖ్యలో వాహనదారులు గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మాధవరం రోడ్డులోని పాండవగల్ దగ్గర ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంత వద్ద నిలబడి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నెల క్రితమే ప్యాచ్ వర్క్ పేరుతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఆదోని–మాధవరం రహదారిలో పడిన గుంతలను పూడ్చడంలో కాంట్రాక్టర్, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. దీంతో ఆదమరిచి ప్రయాణిస్తున్న వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు జె.రామాంజనేయులు, స్థానిక శాఖ కార్యదర్శి హనీఫ్, పార్టీ సభ్యులు కృష్ణ, తాయప్ప, హనుమంతరెడ్డి, హుసేని, మల్లికార్జున, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ పాఠశాలలో ఆదివారం నటరాజ్‌స్వామి అధ్యక్షతన డాక్టర్ జి.నల్లారెడ్డి రచించిన నల్లారెడ్డి శతకం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పుస్తకంలో భాష, సమాజం, సంస్కృతి, ఆధ్యాత్మికతకు సంబంధించిన అంశాలు ఎన్నో ఉన్నాయని, ఈ పుస్తకం సంఘ సంస్కరణ, నైతికతకు సమాజ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వక్తలు హుసేనప్ప, రిటైర్డ్, తహసీల్దార్ షేక్షావలి, యువ రచయిత సద్దాంహుసేన్, శంకరప్ప ఆచారి తదితరులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది తాయన్న, అభినవ అన్నపూర్ణేశ్వరి సుజాతమ్మ, హనుమాన్‌సింగ్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

తొలకరి జల్లులు పుస్తకావిష్కరణ

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 58వ పుస్తకం తొలకరి జల్లులు పుస్తకావిష్కరణ ఆదివారం చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, సభా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కృతి స్వీకర్త వల్లేరి హరినాయుడు, విశ్రాంత అటవీశాఖ అధికారి ఎల్ కృష్ణారెడ్డి, విశ్రాంత జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ పిళ్ళై పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ వల్లేరి హరినాయుడు దంపతులకు ఈ పుస్తం అంకితం ఇచ్చారు. గద్వాల సోమన్నను వారు ఘనంగా సత్కరించి సన్మానించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలోని నేషనల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. విద్య, వైద్యం, క్రీడా నైపుణ్యం, మహిళల ఆర్థికాభివృద్ధికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని రోటరీ క్లబ్ అధ్యక్షులు సందీప్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సైపుల్లా తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరంపై మండలంలోని కుప్పగల్, గణేకల్, జాలిమంచి, పెద్దతుంబళం గ్రామాల్లో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. ఆపరేషన్‌లకు అవసరమైన రోగులను కర్నూలు శాంతిరామ్ ఆస్పత్రి వారి సహకారంతో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని రోగులకు రోటరీ క్లబ్ సహకారంతో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఉచిత కంటి వైద్యశిబిరానికి 100 మంది హాజరై కంటి వైద్య పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జీవన్‌సింగ్, భరత్‌షా, శ్రీధర్‌రెడ్డి, సుబ్బయ్య, హుసేన్‌బాషా, షాబీర్‌బాషా, శివరామ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడ్డ పల్లకోత్సవం



అడ్డ పల్లకీలో పట్టదయ్యస్వామిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో లక్ష దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీ పట్టదస్వామి అడ్డపల్లకీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆకు పూజ, పంచామృతాభిషేకం, జలాభిషేకం, గంగపూజ తదితర పూజలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి మంగళహారతులు పట్టారు. ఈ సందర్భంగా కోలాటం, నందికోలు తదితర కార్యక్రమాలు అలరించాయి. అనంతరం స్వామివారి అడ్డపల్లకీని ఊరేగించారు. కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పీఠాధిపతి శంభులింగస్వామి దైవ సందేశాన్ని వినిపించారు. సోమవారం శ్రీ పట్టదస్వామి లక్ష దీపోత్సవ కార్యక్రమం జరుగుతుందని శంభులింగస్వామి తెలిపారు.



ప్రధాన రహదారిపై నిలిచిన మురుగునీరు



మురుగు నీటిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థి

'కుంట'నహాల్

కౌతాళం: మండల పరిధిలోని కుంటనహాల్ గ్రామం నీటి కుంటలా తయ్యారయ్యింది. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నిత్యం ప్రధాన రోడ్డు పైనే మురుగు నీరు పారుతోంది. దీంతో పాటు గ్రామం దిగువలో ఉన్న పొలాలకు తుంగభద్ర దిగువ కాలువ నుంచి వెళ్లే నీరు కూడా వీటికి తోడవ్వడంతో ప్రజలు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం అధికారుల పర్యవేక్షణ లేకపోవడం. గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ కాలువ లేకపోవడంతో పంటకాలువ నీటితో పాటు మురుగు నీరు నిత్యం ప్రవహిస్తూ ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి సరైన డ్రైనేజీని నిర్మించి గ్రామంలో మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.